
కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

బద్వేలు అర్బన్ : స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్‌జైలు సమీపంలో గల కనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా 33 రకాల పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. తెల్లవారుజాము నుండే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల తీపి తినుబండారాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


బద్వేలు : ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


పోరుమామిళ్ల : బంగారు చీరలో వాసవీమాత


కలసపాడు : ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


ప్రొద్దుటూరు : ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయనగరం వీధిలోని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో శ్రావణమాస చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, పూజాద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. మూలవిరాట్‌ను ప్రత్యేకంగా నూతన పట్టు వస్త్రాలతో, రంగురంగుల పూలదండలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించి కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు.

అమ్మవారికి బంగారు చీర

పోరుమామిళ్ల : పట్టణంలోని అమ్మవారిశాలలో శుక్రవారం శ్రావణమాసంలో చివరి శుక్రవారం కావడంతో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి మూలవిరాట్‌ను బంగారుచీరతో అలంకరించారు. 108 చీరలతో అమ్మవారికి అష్టోత్తర కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గుడి ఉత్సవం అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు విశ్వనాథుల ప్రసాద్, మహిళా మండలి అధ్యక్షురాలు పలుకూరి రాధ, యువజన సంఘం అధ్యక్షుడు శేఖర్, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

కలసపాడు : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ఆర్యవైశ మహిళా మండలి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్యవైశ్య ఉపాధ్యక్షులు గొంట్ల రామాంజనేయులు, ఆయన సతీమణి విజయలక్ష్మిలు ఆర్యవైశ్య మహిళలకు చీరలు, జాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు కామిశెట్టి సుదర్శన్, మహిళా మండలి అధ్యక్షురాలు శకుంతల, మహిళలు పాల్గొన్నారు.

వెల్లాల పార్వతీదేవికి పూజలు

రాజుపాళెం : మండలంలోని పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవికి శుక్రవారం శ్రావణ మాసంలో నాలుగో శుక్రవారం సందర్భంగా అర్చకుడు వెంకటాచలపతి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే మల్లె, జాజి, కనకాంబరం పూలు, 101 నిమ్మకాయలు వేసి అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

చాపాడు : మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. సాక్షి దిన పత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'తవ్వుకున్నోళ్లకు .. తవ్వుకున్నంత..' కథనానికి స్పందించిన మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, ఎస్‌ఐ చిన్న పెద్దయ్య చాపాడు మండలంలో అక్రమ ఇసుక రవాణా జరుకుండా చర్యలు తీసుకున్నారు. మండలంలోని తిప్పిరెడ్డిపల్లె, రాజుపాళెం, వెదురూరు గ్రామాల నుంచి పెన్నానదిలోకి వెళ్లే మార్గాల్లో జేసీబీతో గుంతలు తీయించారు. . ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ హెచ్చరించారు.

నల్ల బాడ్జీలతో నిరసన

మైదుకూరు : రాష్ట్ర ప్రజా రవాణా శాఖ ఉద్యోగుల పట్ల ట్రెజరీ శాఖ అధికారులు ఉదాసీన వైఖరికి నిరసనగా శుక్రవారం మైదుకూరు డిపోలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో అసోసియేషన్ నాయకులు, సభ్యులు ట్రెజరీ ఉద్యోగులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూఏ నాయకులు మాట్లాడుతూ నిలిపివేసిన నైట్ అవుట్ అలవెన్స్‌లను ప్రభుత్వ జీఓ ప్రకారం యథావిధిగా పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన అన్ని రకాల అరియర్స్, సిక్ లీవులకు జీతాలను, ఇంక్రిమెంట్ల అరియర్స్, ఏఏఎస్ అరియర్స్ ఇవ్వాలని పేర్కొన్నారు.

పశు వైద్యశాల తనిఖీ

అట్లూరు : మండలంలోని కమలకూరు పశు వైద్యశాలను శుక్రవారం సిద్దవటం ఏవీహెచ్ ఏడీ డాక్టర్ కె.లక్ష్మిదేవి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. డాక్టరు ఈశ్వరప్రసాద్ సెలవు పెట్టకుండా విధులకు రాలేదన్న విషయం తెలుసుకున్న ఆమె ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం కుంభగిరి, కొండూరు రైతుసేవా కేంద్రాలను ఆమె సందర్శించి రికార్డులను పరిశీలించారు. డాక్టర్లు విధులకు సక్రమంగా హాజరై మూగజీవాలకు వైద్యం అందించాలన్నారు. విధులకు దుమ్మా కొడితే చర్యలు తప్పవన్నారు.

జలమయం

ప్రొద్దుటూరు : వర్షం ప్రభావం కారణంగా డ్రైనేజీ కాలువల్లోని మురుగు నీరంతా రోడ్లపైకి ప్రవహించిన సంఘటన శుక్రవారం సాయంత్రం ప్రొద్దుటూరు పట్టణంలో చోటు చేసుకుంది. సాయంత్రం 4 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. దీంతో పెద్ద ఎత్తున వర్షం నీరు డ్రైనేజీ కాలువల్లోని మురికి నీటితో కలిసి రోడ్లపై ప్రవహించి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. త్రీటౌన్ పోలీస్ స్టేషన్, గాంధీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపించింది. సాధారణ వర్షాలకే రోడ్లపై నీరు ప్రవహించడం పట్టణంలో పరిపాటిగా మారింది.

వైభవంగా వరసిద్ధి వినాయక వార్షికోత్సవం

దువ్వూరు : దువ్వూరు కేసీ కెనాల్ వద్ద వెలసిన శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం 19వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఆలయ అర్చకులు చైతన్య శర్మ పంచామృతాభిషేకం, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాల మధ్య భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

బద్వేలు అర్బన్ : ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్య సాహసాలు పెంపొందుతాయని నెల్లూరు ఎన్‌సీసీ-10 (ఎ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ గణేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఎన్‌సీసీ నేవీ విభాగానికి విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఫిజికల్, మెడికల్ పరీక్షల ఆధారంగా 32 మంది విద్యార్థినీ విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవతో పాటు దేశ సేవ చేయాలనుకునే వారికి ఎన్‌సీసీ విభాగం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రాచపూడి వెంకటసాయికృష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎన్‌సీసీ బెటాలియన్ అధికారులు, కళాశాల ఎన్‌సీసీ ఏఎన్‌ఓ లెఫ్టినెంట్ బాలఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యదర్శి పి.భానుప్రసాద్ ఆధ్వర్యంలో టీ విరామ సమయంలో గేట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా జోనల్ కమిటీ సభ్యుడు వి.రామకృష్ణయ్య, రీజనల్ నాయకుడు ఎస్ఎస్ నారాయణ మాట్లాడుతూ ఏపీపీటీడీ ఉద్యోగులకు నిలిపేసిన అలవెన్స్ మళ్లీ కలపాలన్నారు. ఏఏఎస్ ఇంక్రిమెంట్లు, అరియర్స్, రిటైర్డు ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని పేర్కొన్నారు. చనిపోయిన ఉద్యోగుల అంత్యక్రియలకు రూ.25వేలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో డిపో అధ్యక్షుడు పీవీసీ మోహన్‌రెడ్డి, గ్యారేజ్ కార్యదర్శి అశోక్ కుమార్, జాయింట్ సెక్రెటరీ వీటీ రావు, సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమణమ్మ

బద్వేలు అర్బన్ : ఆయా పంచాయతీల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు బిజివేముల రమణమ్మ అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రణాళికబద్ధంగా పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మండల పరిధిలోని ఆయా జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు త్వరితగతిన బిల్లులు మంజూరయ్యేలా చూడాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. ప్రతి పంచాయతీలో వైద్యశిబిరాలు నిర్వహించడంతో పాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం అజెండాలోని వివిధ అంశాలపై చర్చించారు. తొలుత ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. సమావేశంలో జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, మండల ప్రత్యేకాధికారి నాగరాజారావు, తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, ఎంపీడీఓ నూర్జహాన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ మెంబర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏకీకృత పెన్షన్ విధానం అమలు తగదు


ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

బద్వేలు అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ స్కీం (యూపీఎస్) పథకం అమలు తమకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, దానిని అంగీకరించే ప్రశ్నే లేదని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు టి.శివప్రసాద్ తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి మాట్లాడారు. ఉద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్ పేరును యూపీఎస్‌గా మార్చిందన్నారు. 25 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ గ్యారెంటీ చేస్తున్నట్లు, సర్వీసులో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 60 శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇస్తామని యూపీఎస్ పెన్షన్ విధానంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ఇందులో ప్రస్తావించకపోవడం, పైగా ఈ పథకం అమలు ఐచ్ఛికం అని పేర్కొనడంలోనే అసలు మోసం దాగి ఉందన్నారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ లేకుండా సర్వీసును బట్టి 50 శాతం పెన్షన్ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడమే తమకు ఆమోదయోగ్యమన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల పనిసర్దుబాటు అసంబద్ధంగా ఉందని, ఇష్టారాజ్యంగా వ్యవహరించడం తగదన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ బద్వేలు, గోపవరం మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవానందం, సుధాకర్, క్రిష్టఫర్, సహాధ్యక్షుడు నరేష్, కోశాధికారులు గురయ్య, రామచంద్రయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

పోరుమామిళ్ల : పోరాటాల ద్వారా సాధించుకున్న పాత పెన్షన్ స్కీమ్ భిక్ష కాదని, ఉద్యోగుల హక్కు అని, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సైతం ఖాతరు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్‌ను అమలు చేస్తున్నాయని యూటీఎఫ్ నాయకులు అన్నారు. శుక్రవారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకులు ఆందోళన చేపట్టారు.

నేడు పింఛన్ల పంపిణీ

చాపాడు : మండల వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు తెలిపారు. సెప్టెంబర్ 1న ఆదివారం సెలవు దినం కావటంతో ప్రభుత్వం ఆదేశాల మేరకూ ఆగస్టు 31 పింఛన్లు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. మిగిలిపోయిన లబ్ధిదారులకు సెప్టెంబర్ 2న సోమవారం పింఛన్ల డబ్బులు పంపిణీ చేస్తామని తెలిపారు.

47 పింఛన్ల తొలగింపు

ప్రొద్దుటూరు : సెప్టెంబర్ నెలకు సంబంధించి ప్రొద్దుటూరు నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 47 పింఛన్లను సంబంధిత అధికారులు తొలగించారు. సదరం సర్టిఫికెట్లలో నకిలీవిగా గుర్తించి పింఛన్లను తొలగిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 33,630 పింఛన్లను శనివారం నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పంపిణీ చేయనున్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో 15,145 పింఛన్లు, ప్రొద్దుటూరు మండలంలో 13,785, రాజుపాళెం మండలంలో 4,700 పింఛన్లను లబ్ధిదారులకు అందించనున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా మా క్షయిదారుడు అయిన కుందా లక్ష్మణరావ్ S/o లక్ష్మయ్య, డో.నెం.4/281ఎ, ప్రొద్దుటూరు వారు ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు నందు O.S.No.109/2021 గల దావాను షెడ్యూలు దాఖలా ఆస్తిలో తన హక్కును నిర్ధారించవలెనని, పర్మనెంట్ ఇంజక్షన్ ఆర్డరు కోరుచూ I.A.No.99/2021 మరియు క్రయ, విక్రయములు, ఎటువంటి దస్తావేజులు వ్రాయకూడదని I.A.No 98/2021 వ పిటిషన్‌ను వంకం శివ నాగమునయ్య S/o నారాయణ, డో.నెం.9/128, దొమ్మర నంద్యాల మైలవరం మండలం మరియు పేల్లా నారాయణ దాస్ S/o నరసింహులు, డో.నెం.8/36 దొమ్మర నంద్యాల అను వారలపైన దాఖలు చేసి వున్నాడు. అయితే మా క్షయిదారునికి తెలియకుండా షెడ్యూలు దాఖల ఆస్తిని విక్రయించవలెయునని ప్రయత్నించుచున్నారు. అట్లు ఎవరైననూ కొన్న యెడల అవి చెల్లనేరవు. మా క్షయిదారునిపై బ్రైండ్ కాజాలవు మరియు మా క్షయిదారుడు తీసుకొనబోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని తెలియచేయడమైనది.

షెడ్యూలు

RCC House Property with First Floor Situated in Kadapa District-Proddatur Reg. District proddatur Sub Reg.District in Proddatur Municipality Ward No.4, Venkateswarapeta/Chowdamma Temple Street having D.No.4/719 with assessment No.1014003429 in S.No.386 of Proddatur Village Field.

ఎన్.వి.వరప్రసాద్, అడ్వకేట్, ప్రొద్దుటూరు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం


మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర

మైదుకూరు : మానవ మనుగడకు మొక్కలే ఆధారమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మైదుకూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వనం-మనం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్రతో కలసి ఎమ్మెల్యే, మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, మేనేజర్ పరమేశ్వరరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కేవీకేలో వనం-మనం

మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో కేంద్రం ఆవరణలోని రెండు ఎకరాల విస్తీర్ణంలో కానుగ, వేప, రావి, నేరేడు తదితర మొక్కలను నాటారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ జుబేదా, కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ, డ్వా ఏపీఓ రామచంద్రారెడ్డి, శాస్త్రవేత్తలు శ్రీవిద్యారాణి, కాంతిశ్రీ, ఫిరోజ్ హుస్సేన్, డ్వామా అధికారులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి


మాట్లాడుతున్న సీఐ యుగంధర్

ప్రొద్దుటూరు క్రైం : విద్యార్థి దశనుంచే క్రమశిక్షణను అలవరచుకొని అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని టూ టౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగేలా పోలీసు అధికారులు జిల్లా వాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం టూ టౌన్ పరిధిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని చెప్పారు. బాగా చదువుకొని సమాజానికి, దేశానికి సేవ చేయాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు విజయాలు సాధించాలని తెలిపారు. అనంతరం పోక్సోయాక్టు, పిల్లల భద్రత, బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, డయల్ 100, రహదారి భద్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సోషల్ మీడియా, సైబర్‌నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

జెడ్పీటీసీలతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి భేటీ


మైదుకూరు నియోజకవర్గ జెడ్పీటీసీలతో సమావేశమైన ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల జెడ్పీటీసీలతో శుక్రవారం కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి సమావేశమయ్యారు. జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థిగా బ్రహ్మంగారిమఠం జెడ్పీటీసీ రామగోవిందరెడ్డిని ఇటీవల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖరారు చేశారు. ఈ క్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రొద్దుటూరులోని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి నివాసంలో జెడ్పీ అభ్యర్థి రామగోవిందరెడ్డి, చాపాడు, మైదుకూరు, ఖాజీపేట, దువ్వూరు జెడ్పీటీసీలతో సమావేశమయ్యారు. జెడ్పీ అభ్యర్థి ఎంపికతో పాటు నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై వారితో ఎంపీ చర్చించినట్లు సమాచారం.

వైఎస్ జగన్ ఆత్మస్థైర్యాన్ని ఎవరూ దెబ్బతీయలేరు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

ఖాజీపేట : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆత్మస్థైర్యాన్ని ఎవరూ దెబ్బతీయలేరని ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజనల్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. దుంపలగట్టులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అగ్రనేతలు టీడీపీలో చేరుతున్నట్లు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, విజయసాయిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి జగన్ వెంటనే ఉంటామని చెప్పారని తెలిపారు. అయితే కొన్ని పత్రికలు విష ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఆయన ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను కొనడం చంద్రబాబుకు అలవాటే

పోరుమామిళ్ల : ప్రజాప్రతినిధులను కొనడం, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం చంద్రబాబునాయుడుకు అలవాటేనని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని దెబ్బతీయాలని, వైఎస్సార్‌సీపీని నాశనం చేయాలని చంద్రబాబు చూస్తున్నారన్నారు. 2019లో చంద్రబాబు 23 మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు ఎంపీలను పశువులను కొన్నట్లు కొన్నారన్నారు. నేడు ఇన్‌డైరెక్టుగా రాజ్యసభ సభ్యులను, ఎమ్మెల్సీలను కొనుగోలు చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి చంద్రబాబు భయపడుతున్నాడన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అన్ని విధాల వైఫల్యం చెందిందని ఆయన ఆరోపించారు.

హెచ్‌ఐవీ నియంత్రణ అందరి బాధ్యత

ప్రొద్దుటూరు క్రైం : హెచ్‌ఐవీ నియంత్రణ అందరి బాధ్యత అని చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్‌కుమార్ తెలిపారు. స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో 'మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ ప్రదీప్‌కుమార్, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ శ్రీరాములు, విద్యార్థులు, సీఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పని సర్దుబాటు అస్తవ్యస్తం

ప్రొద్దుటూరు : రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల పని సర్దుబాటు అస్తవ్యస్తంగా ఉందని ఏపీ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందిళ్ల సుబ్బరాజు యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పని సర్దుబాటులో సీనియారిటీకి ప్రాధాన్యం ఇవ్వకుండా కచ్చితంగా ఈ స్కూలే తీసుకోవాలని బలవంతంగా ఉపాధ్యాయులను పంపిస్తున్నారని ఆయన తెలిపారు.

మొక్కలను విరివిగా పెంచాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మొక్కలను విరివిగా పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని అగస్త్యేశ్వర స్వామి ఆలయ అర్చకులు పేర్కొన్నారు. శుక్రవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆలయంలో వనమహోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు. శైవాగమ వేదపాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేష్ శర్మ, ఆలయ కమిటీ ఎక్స్‌అఫిషియో మెంబర్ మహేశ్వరశర్మ, అర్చకుడు ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించండి

అట్లూరు : స్థానిక సమస్యలను త్వరగా పరిష్కరించాలని స్థానిక స్త్రీ శక్తి భవనంలో శుక్రవారం నిర్వహించిన మండల సమావేశంలో మండల అధ్యక్షురాలు రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శాఖలవారిగా మండలంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కామసముద్రం సర్పంచ్ ఆర్వీ సుబ్బారెడ్డి , డాక్టర్ మాధురి , ఎంపీడీవో సుజాతమ్మ, ఏఈలు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

నూతన భవనం ప్రారంభం


పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ సూర్యప్రకాష్‌రెడ్డి, డాక్టర్ కొమ్మా సింధూరి

ప్రొద్దుటూరు క్రైం : గత 9 ఏళ్లుగా ప్రొద్దుటూరు ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తూ అందరి ఆదరాభిమానాలను పొందిన 'ప్రొద్దుటూరు కిడ్నీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, లేజర్ సెంటర్, బాలాజీ స్కాన్ సెంటర్' నూతన భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. గాంధీరోడ్డులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు ఎదురుగా నూతన భవన సముదాయంలో ప్రొద్దుటూరు కిడ్నీ సూపర్ స్పెషాలిటి హాస్పిటల్‌ను ఏర్పాటు చేశారు. గతంలో కంటే మరిన్ని అత్యాధునిక వసతులు, వైద్య సేవలను అందించనున్నట్లు హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ చల్లా సూర్యప్రకాష్‌రెడ్డి, డాక్టర్ కొమ్మా సింధూరి తెలిపారు. అత్యాధునికమైన 3డీ, 4డీ స్కానింగ్ సౌకర్యం కలదన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు త్యాగరాజ రెడ్డి, నరసింహారెడ్డి, లక్ష్మీనరసయ్య, రంగారెడ్డి, పలువురు డాక్టర్లు, పట్టణంలోని ప్రముఖులతో పాటు చల్లాసుబ్బిరెడ్డి, సరస్వతమ్మ, తన్వి, చాన్వి, డాక్టర్ కుముదిని, డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ప్రతీక్, ప్రణతి పాల్గొన్నారు.